నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | ఏప్రిల్ 09, 2024 | www.navatelangana.com

ఎలుగుబంటి మృతిపై ఆరా

- నవతెలంగాణ కథనంతో కదిలిన ఫారెస్ట్ అధికారులు


పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని " రెడ్డిపేట అడవిలో ఎలుగుబంటి మృతి" చెందినట్టు ప్రచురించిన వార్తతో ఫారెస్ట్ అధికారులు స్పందించారు. అటవీ ప్రాంతంలో సుమారు రెండు గంటలు తిరిగి ఎలుగుబంటి కళేబరాలను గుర్తించారు. స్థానిక మండల పశువైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో సంఘటన స్థలంలో పోస్ట్ మార్టం నిర్వహించి, వెంట్రుకలను సాక్షుల సమక్షంలో కాల్చి వేశారు. ఎలుగుబంటి దాదాపు 2నెలల క్రితం మృతి చెందడం గమనార్హం. మృతికి గల కారణం కోసం ఎముకలను సేకరించి ఫోరెన్సి ల్యాబ్ కు పంపనున్నట్లు, పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సెక్షన్ అధికారి శంకర్ తెలిపారు. కార్యక్రమంలో బీట్ అధికారులు రామలీల, శేఖర్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వడగళ్ల వానతో ఆందోళన

నవతెలంగాణ-బోధన్

బోధన్, సాలూర మండలాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంలో వడగళ్ల వానతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కొంతమంది రైతులకు సంబంధించిన ధాన్యం కుప్పలు ఇంకా రోడ్లపైనే ఉండడంతో అకాల వడగళ్ల వానతో తడిసిపోతాయని ఆందోళన చెందారు. అలాగే పలుచోట్ల సన్‌ఫ్లవర్ పంట కూడా కుప్పలు ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతూ పంటను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడవలసి వచ్చింది.


కురిని వడగళ్ల వాన


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నామినేషన్ల దాఖలుకు
నిర్దేశిత నిబంధనలు పాటించాలి

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానం నుండి ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, అవలంభించాల్సిన విధానాలపై కలెక్టర్ క్షుణ్ణంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. నామినేషన్ ఫారం-2ఏ ను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుండి ఉచితంగా పొందవచ్చని సూచించారు. ఈ నెల 18 నుండి నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, సమీకృత జిల్లా కార్యాలయంలోని తన (కలెక్టర్) ఛాంబర్లో ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల సమయంలో నామినేషన్లను అందించాల్సి ఉంటుందని తెలిపారు. సెలవు రోజు ఆదివారం మినహాయించి, మిగితా అన్ని పని దినాలను కలుపుకుని, తుది గడువు అయిన ఈ నెల 25 వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని అన్నారు. నిర్ణీత గడువు, నిర్ణీత సమయంలోపు రిటర్నింగ్ అధికారి ఛాంబర్ వద్దకు చేరుకున్న వారి నామినేషన్ ఫారాలు మాత్రమే స్వీకరించనున్నట్టు తెలిపారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే జనరల్ అభ్యర్థులు రూ. 25 వేలు, ఎస్సీ,ఎస్టీ కేటగిరీలకు చెందిన వారైతే రూ. 12500 లను సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ మొత్తాన్ని నగదు రూపేణా, లేదా చలానా రూపంలో చెల్లించవచ్చని, చెక్కులు అంగీకరించబడవని సూచించారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు నామినేషన్ ను ప్రతిపాదిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. అదే రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుందని సూచించారు. నామినేషన్ సమర్పించేందుకు వచ్చే వారు పార్టీ కండువాలు, టోపీలు ధరిస్తే ఆర్.ఓ కార్యాలయం లోనికి అనుమతించబడరని స్పష్టం చేశారు.

కాగా, ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తులు చేసుకుని అనుమతి పొందాలని సూచించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు వంటివి ముంద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127 - ఏ సూచనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రచార ప్రకటనలు, ప్రచార అంశాలు, ఎల్.ఈ.డీ డిస్ ప్లే కంటెంట్ తదితర వాటికి ఎంసిఎంసి ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. అలాగే, అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, వాహనాల కోసం సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారుల (ఏ.ఆర్.ఓ) నుండి అనుమతి తీసుకోవాలని, పార్లమెంటు నియోజకవర్గం పరిధి మొత్తంలో నిర్వహించే ప్రచార కార్యక్రమాలు, ఎల్.ఈ.డీ వాహనాలు, ఛాపర్, హెలిప్యాడ్, హెలికాప్టర్ వంటి వాటి అనుమతులను ఆర్.ఓ కార్యాలయం నుండి పొందాలని సూచించారు. కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలి

- రాజకీయలకు అతీతంగా యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్‌లను నియమించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దమెర కిరణ్ డిమాండ్
- అట్టహాసంగా ఎస్ఎఫ్ఐ 23వ జిల్లా మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దమెర కిరణ్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, రాజకీయలకు అతీతంగా యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్‌లను నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దమెర కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 23వ జిల్లా మహాసభలు స్థానిక నాందేవ్‌వాడలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో అట్టహాసంగా ప్రారంభమైయ్యా యి. ఈ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మొదలై మూడు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం దారుణమని అన్నారు. అకాడమిక్ ఇయర్ ప్రారంభం అవుతున్నా విద్యారంగం సమస్యలపై పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర యూనివర్సిటీలకు రాజకీయాలకు అతీతంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, విడుదల చేయాలని అన్నారు. ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం పౌష్టిక ఆహారాన్ని అందించేటట్టుగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక

ఈ 23వ జిల్లా మహాసభలలో నూతన జిల్లా కమిటీ 15 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా పోషమైన మహేష్, రాచకొండ విగ్నేష్ ఎన్నికైయ్యారు. జిల్లా ఆఫీస్ బేరర్లుగా సిద్దల నాగరాజు, దీపిక, ప్రసాద్ జిల్లా కమిటీ సభ్యులుగా సంధ్యారెడ్డి, గణేష్, జవహర్, ముత్యం, వాణి, బాపూరావ్, శివ, అభిషేక్ ల ను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో దినేష్, వరదరాజ్, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

అదేవిధంగా రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో బిలు ను పెట్టాల్సిందిగా కోరారు. నూతన జాతీయ విద్యా విధానంతో విద్యార్థులకు అత్యంత తీరని అన్యాయం చేస్తున్న బిజెపి సర్కార్‌ను విద్యార్థులంతా రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఓడించాలని పిలుపునిచ్చారు.

సెక్టోరియల్ ఆఫీసర్
వనిత పదవీకాలం పొడగించొద్దు

- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా విద్యాశాఖ సర్వ శిక్షలో పనిచేస్తున్న సెక్టోరియల్ ఆఫీసర్-5 జెండర్ అధికారిని వనిత పదవి కాలం పొడగింపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని అని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్, టిపిటిఎఫ్, డిటిఎఫ్, ఎస్సీ ఎస్టీ యూఎస్ ఆధ్వర్యంలో సర్వశిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ హైదరాబాద్‌కు సోమవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ వనిత గతంలో కంజర ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పనిచేసిన కాలంలో మధ్యాహ్న భోజన విషయంలో అవినీతికి పాల్పడి సస్పెండ్‌కు గురైయ్యారని, అంతకుముందు పనిచేసిన నాగేపూర్ పాఠశాలలో కూడా సెలవుల మంజూరు విషయంలో అక్రమాలకు పాల్పడ్డట్టుగా ఆరోపణలు ఉన్నట్టు తెలిపారు. 'ఈ ఆరోపణలను పట్టించుకోకుండా జెండర్ ఈక్విటీ అధికారిగా పూర్తి కాలం మూడు సంవత్సరాలు పనిచేసిన వనిత ఫారిన్ సర్వీసును నిలుపుదల చేస్తూ ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలకు హెడ్మాస్టర్‌గా పంపవలసి ఉంటుంది. సెక్టోరియల్ అధికారి-5 గా పనిచేసిన కాలంలో ఆమె పనితీరుపై అవినీతికి సంబంధించి వార్తపత్రికల్లో పలు కథనాలు వచ్చాయి. కానీ ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా జిల్లా విద్యాశాఖ అధికారి సదరు అధికారిని మరో సంవత్సరం పొడిగించాలని ఇటీవల రాష్ట్ర సర్వ శిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు ప్రతిపాదనల లేఖ రాయడం పట్ల ఉపాధ్యాయ సంఘాలుగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జిల్లా విద్యాశాఖ అధికారి ఏకపక్షంగా పొడిగింపు కోరుతూ పంపిన లేఖను ఉపసంహరించుకోవాలని సదరు అధికారినిపై గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్టు' టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు సత్యానంద్, రమేశ్, సల్ల సత్యనారాయణ(టీపీటీఎఫ్), ఎం బాలయ్య, పి. శాంతన్(డీటీఎఫ్), జి.సుదాం(ఎస్సీఎస్టీయూఎస్) తెలిపారు.

అంగన్‌వాడీలకు ఆర్థికనష్టం చేకూర్చొద్దు

- ప్రభుత్వం విడుదల చేసిన మెమో 1334ను ఉపసంవరించుకోవాలి : సీఐటీయూ


వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-పిట్లం

అంగన్‌వాడీలకు ఆర్థిక నష్టం చేకూర్చేలా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పైన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మేము నెం 1334/ ఐసీడీఎస్-1/2024ను ఈనెల 3 విడుదల చేసిన సర్కులర్ ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేశ్‌గొండ డిమాండ్ చేశారు. జిల్లా డిడబ్ల్యుఓ అధికారికి అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కల్పన, కార్యదర్శి బాబాయితో కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు టీచర్లకు 2 లక్షలు, హెల్పర్ లకు ఒక లక్ష రూపాయలు 60 సంవత్సరాలు పైబడిన వారికి వీఆర్ఎస్ సౌకర్యము కల్పిస్తూ కొత్త జీవో ఇస్తామని మంత్రులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ప్రభుత్వం నేటికీ కొత్త ఉత్తర్వులను జారీ చేయలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ వ్యతిరేకించిన పాత జీవో ఉత్తర్వులనే మళ్లీ ముందుకు తెచ్చి అమలు చేయాలని ప్రయత్నించడం సరి కాదన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఆర్థికంగా నష్టం కలిగించే ప్రయత్నాలు మానుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

రక్తదానం.. విలువైన బహుమానం

- రక్త దానం చేసి ప్రాణాలు కాపాడండి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. యెన్ శ్రీదేవి



నవతెలంగాణ-కామారెడ్డి

రక్త దానం చేయడం వల్ల విలువైన ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రెడ్ క్రాస్ సంస్థ, జిల్లా ప్రధానాసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అడ్వకేట్స్ సొసైటీ హాల్‌లో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పాల్గొన్నారు. జిల్లా న్యాయ మూర్తి శ్రీదేవి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మరొక వ్యక్తికి ఇవ్వగలిగే అత్యంత విలువైన బహుమతి ప్రాణదానం అంటే రక్తదానమని అన్నారు. రక్తాన్ని ఎర్ర రక్త కణాలు, ప్లాస్మా మొదలైనవిగా వేరు చేసినపుడు ఒకరి కంటే ఎక్కువ ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడంలో జిల్లా ప్రజలు ముందుండడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం తరపున కూడా వివిధ శాఖల ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరిస్తూ ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్ట్ స్టాఫ్, ఇతరులు రక్త దానం చేశారు. రక్త దానం చేసినవారికి న్యాయమూర్తి స్వయంగా పండ్లు, ఫ్రూట్ జ్యూస్ అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్ రావు సీనియర్ సివిల్‌జడ్జి, కార్యదర్శి నాగారాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ చింతల గోపి, సెక్రటరీ సురేందర్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, కార్యదర్శి, రఘు కుమార్ జిల్లా కోర్ట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ టీ.రాజ గోపాల్ గౌడ్, కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, న్యాయ ఉద్యోగుల అధ్యక్షుడు భుజంగరావు, జిల్లా కోర్ట్ సూపరింటెండెంట్స్ వెంకట్‌రెడ్డి, శ్రీధర్, నాగేంద్ర జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పర్యవేక్షకుడు చంద్రసేన్‌రెడ్డి, సమీయుల్లా ఖాన్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు దేవా, విజయలక్ష్మీ, న్యాయవాదులు నరసింహారెడ్డి, సలీం, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- జుక్కల్‌లో సాదాసీదాగా పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు జుక్కల్ మండల కేంద్రంలో సోమవారం ఉదయం వేళ ప్రత్యక్షమయ్యారు. స్వయంగా కారు నడుపుతూ వచ్చి సాదాసీదాగా పర్యటించారు. స్థానిక హోటల్‌లో భోజనం చేశారు. అనంతరం జీపీ కార్మికులతో మాట్లాడారు. జీపీలో ఎంత మంది కార్మికులు ఉన్నారని, జీతం ఎంత వస్తుందని ఆరా తీశారు. సీదాసాదాగా ఉంటు అందరితో కలిసి తిరగడంతో సమాచారం అందుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు ఆశ్చర్యపోయారు. అనంతరం టీకొట్టు వద్దకు వెళ్లి చాయి తాగుతు టీకోట్టు యజమాని సాదక బాదలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తిరుగుతు జీపీ వర్కర్లు, సిఫాయికార్మీకులు కన్పించడంతో వారితో పలు అంశాలైన పైన ఆరాతీశారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు జడ్పీటీసి లక్ష్మీబాయి దాదారావ్ పటేల్ కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇలా ఉల్లాసంగా ఉత్సాహంగా సంతోషంతో జోరుగా యుత్ సభ్యులతో కలిసి తిరగడంతో జోష్ కన్పించింది. ఎమ్మెలే వెంటా యూత్ విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చాయ్ ఓటర్ యజమానితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దోపిడీకి పాల్పడితే చర్యలు

- ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వహకులతో ఎమ్మార్వో శివప్రసాద్
- నవతెలంగాణ కథనం నేపథ్యంలో సమావేశం

నవతెలంగాణ-భిక్కనూర్

రైతుల వ్యవసాయ భూముల రికార్డులు ధరణి ఆన్‌లైన్లో ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకులు దోపిడీకి పాల్పుడుతున్న విషయంలో "ములాఖత్..?" అనే శీర్షికన నవతెలంగాణ ప్రచురించిన కథనానికి తహసీల్దార్ శివప్రసాద్ స్పందించారు. భిక్కనూరు మండలంలో ఉన్న ఇంటర్నెట్ సెంటర్లు, మీసేవ కేంద్రాల నిర్వహకులతో సోమవారం రెవెన్యూ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మార్వో ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులతో మాట్లాడుతూ.. రెవెన్యూ కార్యాలయంలో ఏ పనైనా చేపిస్తామని చెప్పి, పట్టా పాస్‌పుస్తకాలలో భూముల రికార్డులు నమోదు చేస్తామని డబ్బులు వసూలు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ధరణి ఆన్‌లైన్ చేసిన తర్వాత ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీతమైన ధర రూ.200 మాత్రమే తీసుకోవాలని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసిన ధరణి ఆపరేటర్‌తో కుమ్మక్కు అయినట్లు తెలిసిన అట్టివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది అనిల్‌కుమార్, ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకులు, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్వో


చెట్టుకు ఢీకొన్న స్కూల్ బస్సు

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

- విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలకు చెందిన బస్సు చెట్టుకు ఢీకొనడంతో బస్సులోని విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సోమవారం ఉదయం మండలంలోని కారేపల్లి, రహత్‌నగర్ గ్రామాల నుండి విద్యార్థులను రోజు మాదిరిగానే ఉదయం పాఠశాలకు తీసుకువస్తుండగా కారేపల్లి ఘాట్ వద్ద బస్సు స్టీరింగ్ విరిగిపోవడంతో చెట్టుకు ఢీకొనడంతో బస్సులోని విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు, విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఘటన స్థలానికి చేరుకొని ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద ఘటనను తెలుసుకున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రమాద ఘటనపై స్థానిక నాయకులతో మాట్లాడి విద్యార్థుల తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని కోరారు. ప్రమాద సమయంలో బస్సులో 50 మందికి పైగా విద్యార్థులున్నట్టు సమాచారం.

చద్మల్‌లో మైనింగ్ వెంటనే ఆపాలి

- సీపీఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరం నాయక్
- లేకుంటే ప్రజాఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరిక

నవతెలంగాణ-గాంధారి



మాట్లాడుతున్న నాయకులు

మండలంలోని చద్మల్ మైనింగ్ వెంటనే ఆపాలని సీపీఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతీరం నాయక్ అన్నారు. గత పది సంవత్సరాల కన్నా ముందు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మైనింగ్ అడ్డుకోవడం కోసం అనేక పోరాటాలు చేపట్టినట్టు గుర్తుచేశారు. మైనింగ్‌తో పర్యావరణం దెబ్బతింటాయని ప్రజలకు రోగాలు వస్తాయని పశువులకు అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రారంభమై కుటుంబంలో ప్రతి మనిషికి విషవాయువుల ప్రారంభమై ఆస్పత్రుల పాలవుతున్న లక్షల రూపాయలు ఖర్చవుతున్న పాలకులకు మాత్రం ఏమీ పట్టనట్టు కనబడుతోంది. స్థానిక ఎమ్మెల్యే నెలరోజులు మైనింగ్‌ను బందు చేయించి మళ్లీ ఎందుకు ప్రారంభించారో సమాధానం ప్రజలకు చెప్పాలని అన్నారు. పాలకుల లాభాల కోసం ప్రజలకు ఏమైనా పట్టవని, ఎమ్మెల్యే స్పందించి మైనింగ్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చర్మల్ బీర్మల్ సోమారం దుర్గం గుజ్జుల్, నేరల్ నాగులూర్ గ్రామాలలో అందరూ మంచాన పడ్డారని వీరికి విలువైన వైద్యం అందించాలని అన్నారు. లేనిపక్షంలో ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని ప్రభుత్వ అధికారులకు, పాలకులకు హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా పంథా జిల్లా నాయకులు దేవ్ సింగ్ నాయక్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్, బంజారా సేవా సంఘం జిల్లా నాయకులు పోమానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు టెంట్ సౌకర్యం

- నవతెలంగాణ కథనానికి స్పందన


కార్మికులతో మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-లింగంపేట్

'ఉపాధికి ఎండ దెబ్బ' అనే శీర్షికతో నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఏపీడి వామన్ రావు జిల్లాలోని ఏపీఓలకు అప్రమత్తం చేశారు. సోమవారం ఏపీడి వామన్ రావు రాజంపేట్ మండలంలో పని జరిగే ప్రదేశాలకు వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిలువ నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో తాగునీటిని అందుబాటులో ఉంచారు. ఎండ దెబ్బ తగలకుండా కూలీలకు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ప్రతిరోజు కూలీలకు అందుబాటులో ఉంచాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఏపీవో వినోద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బిల్ కలెక్టర్లకు సన్మానం


బిల్‌కలెక్టర్లను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-ఆర్మూర్

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ వసూళ్ళు చేసిన బిల్ కలెక్టర్స్ కి మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం సన్మానించారు. ఈ సంవత్సరం కూడ మంచి వసూళ్ళు చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ షేక్ అయుం, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, బిల్ కలెక్టర్లు రామ్ శంకర్, సిహెచ్ గంగ మోహన్, సంగీత, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు మగ్గిడి పాఠశాల విద్యార్థిని ఎంపిక


నిషితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవ తెలంగాణ-ఆర్మూర్

రెండు నెలల కిందట జరిగిన సాయి వాలీబాల్ అకాడమీ హాస్టల్ సెలక్షన్స్‌లో మండలంలోని మగ్గిడి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వేదగిరి నిషిత సెలెక్ట్ అయినట్టు ప్రధానోపాధ్యాయురాలు హరిత సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది విడిసి సభ్యులు నిషితను, కోచ్ మధును అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదగాలని నిషితను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్


ఎరువుల దుకాణం తనిఖీచేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ పాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబుతో కలిసి సోమవారం మండలం లోని దర్మారం(బీ), నడ్పల్లి, డిచ్‌పల్లిలోగల ఎరువుల విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాస్ మిషన్‌లో ఉన్న ఎరువుల బస్తాల నిల్వలు, భౌతికంగా ఉన్న నిల్వలను ఆన్లైన్ వెరిఫికేషన్ చేయడం జరిగిందని వివరించారు. ఎరువుల బస్తాలు ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే రైతులకు విక్రయించాలని, అలా కాకుండా నేరుగా రైతులకు అందజేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మన ఊరు-మన బడిలో కోటీ 35లక్షల నిధులు మంజూరు

- ఎంపీడీవో లింగంనాయక్

నవతెలంగాణ-మోపాల్

మండలకేంద్రంలోని హైస్కూల్లో సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఎంపీడీవో లింగం నాయక్ అధ్యక్షతన మన ఊరు మనబడి నిధులపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు చేశారు. స్కూల్లో ప్రధాన సమస్యలను గురించి చర్చించారు. ముఖ్యంగా డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్ రిపేరు, మైనర్ ఎలక్ట్రికల్ వర్క్ ను అమ్మ కమిటీల ఆధ్వర్యంలో చేయిస్తారని ఎంపీడీవో లింగం నాయక్ తెలిపారు. మండలానికి మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ఒక కోటి 35 లక్షలు రూపాయల నిధులు వచ్చాయని ఆయన తెలిపారు .కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి తదితరులు పాల్గొన్నారు

స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామంలోని 'శ్రీ కోదండ రామాలయ' సువర్ణ మహోత్సవాలు ఈ నెల 9 నుండి 14 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే సందర్భంలో 'శ్రీ కోదండ రామాలయం' 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా చేపట్టడం జరుగుతుందని ఆలయ అర్చకులు జోషి నాగరాజు తెలిపారు. ఈ నెల 17న స్వామి కళ్యాణం, రథోత్సవం, 18న భక్తుల సౌకర్యార్థం మహా అన్నదాన సత్రం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.


ఏఐపీఎస్‌యూ మహాసభలను విజయవంతం చెయ్యండి

- జిల్లా ఇన్చార్జ్ బోడ అనిల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్యు) బోధన్, సిరికొండ, డిచ్‌పల్లి, నిజామాబాద్ టౌన్ ఇతర మండల మహాసభలు ఈనెల ఆఖరిలోపు నిర్వహించటం జరుగుతుందని ఏఐపిఎస్‌యూ జిల్లా ఇన్చార్జ్ బోడ అనిల్ తెలిపారు. రాబోవు రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు భవిష్యత్తు ఉద్యమ కార్యచరణని ఈ మహాసభ వేదికగా రూపొందించనున్నట్టు తెలిపారు. సైంటిఫిక్ ఎడ్యుకేషన్ అభివృద్ధి చేసే విధంగా భవిష్యత్తు కర్తవ్యాలను తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ 7800 కోట్ల రూపాయలు, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలని తెలిపారు. వీటితోపాటు ఈ వేసవి సెలవుల్లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, వసతి భవనాలు, కళాశాల భవనాలను పునఃర్మించాలని అన్నారు. వీటితో పాటు నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసే విధంగా భవిష్యత్తు పోరాటాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐపిఎస్యు ప్రతినిధులు అంకోష్, బల్ భీమ్, ఆకాష్, వినయ్ పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా కాపాడుకోవాలి


ధాన్యం పరిశీలిస్తున్న ఏవో

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల పీఏసీఎస్ పరిధిలోని ప్రధాన వరి కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...రానున్న రెండు రోజులు వర్షసూచన ఉన్నందున రైతులు తమ వరి ధాన్యం తడవకుండా టర్పాలిన్ కాగితంతో కప్పి ఉంచాలని అన్నారు. తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తేవడానికి ముందు తేమ 17 శాతానికి మించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సీఈఓ జక్కని శ్రీనివాస్,సెంటర్ ఇంచార్జ్ సతీష్ గౌడ్,సిబ్బంది సాయిపవన్,సాయిబాబా, రైతులు పాల్గొన్నారు.

కొత్త ఊసులు.. కోటి ఆశలు

- ఈ మధుమాసంలో సంవత్సరానికి ఆది ఉగాది
- శ్రీ క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం నేడు ఉగాది పండుగ
- అలరించనున్న కవిసమ్మేళనాలు





నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

తెలుగు సంవత్సరాది నేడు ఉగాది చైత్ర శుధ్య పాడ్యమి రోజు నుంచి నూతన తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది, చాంద్ర మాసం పాటిస్తూ ఈ పండుగను జరుపుకుంటారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం, జాతక విశేషాలతో ఉగాది పర్వదినం ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకోనున్నారు. బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. శ్రీక్రోధి నామ సంవత్సరం కొత్తదనాన్ని తీసుకురావడమే కాకుండా సమాజంలోనూ అందరి జీవితాల్లోనూ కొత్త ఆశలు చిగురింప జేసి కోటి కోర్కెలు పువ్వులై విరబూయాలని ఆశిద్దాం.

తెలుగువారి వాకిళ్ళలో అప్పుడే ఉగాది కళ వచ్చేసింది. మరు మల్లెలు గుమ్మంటున్నాయి. శిశిరంలో ఆకులు రాల్చిన చెట్లు కొత్త చివుర్లు తొడుక్కొని పచ్చగా మెరిసిపోతున్నాయి. కవుల కండువాలు సర్దేసుకుంటూ హడావిడి పడిపోతున్నారు. వేప పూల గుమగుమలు మత్తకోకిల కుహూ-కుహూ రావాలా సంగతి మరి అడకండి ఈ తొలి పండగ సందడిని రెండు చేతులా ఆహ్వానిస్తూనే పంచాంగ శ్రవణం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాడు సామాన్యుడు. అందులో చెప్పేవి జరిగిన జరక్కపోయినా భవిష్యత్తు గురించి తెలుసుకోవడం అదో తృప్తి. ఉగాది ఊసులు గురించి పంచాంగం పదనిసల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.' వసంతి సుఖం యధా తథా అస్మిన్ తి, వసంత కాలంలో ప్రజలు సుఖంగా ఉంటారు అని దీని అర్థం. నిజమే అప్పటిదాకా చలికి ముడుచుకుని పోయిన జనానికి కాసింత ఊరట తెలుస్తూ ఉంటుంది. అటు పూర్తి చలి ఇటు పూర్తి ఎండ కానీ సమశీతోష్ణ స్థితిలో ఉండే సుఖం తెలుస్తూ ఉంటుంది అదిగో సరిగ్గా అలాంటి సమయంలో వచ్చే పండుగ ఉగాది.

పంచాంగ శ్రవణం......

తెల్లవారుజామునే తలంటు కొత్త బట్టలు కట్టుకోవడం ఉగాది పచ్చడి తినడం ఇష్టదైవాన్ని దర్శించుకోవడం పంచాంగ శ్రవణం తదితర పనులను ఉగాదినాడు చేయాలన్నది మన సాంప్రదాయం. పంచాంగ శ్రవణం పండగకు ఉన్న ఖగోళ శాస్త్రీయ దృక్కోణానికి అద్దంపట్టే సంప్రదాయం. ఒకప్పుడు రైతులంతా దీని కోసం ఎదురు చూసే వారు రాబోయే సంవత్సరంలో వాతావరణం ఎలా ఉంటుంది.. ఎలాంటి పంటలు వేయాలి.. ఏరువాక ఎప్పుడు సాగాలి.. అనే విషయాన్ని ఆ ఏడాది ఫలాలను బట్టి నిర్ణయించేవారు.. కొన్ని ప్రాంతాల్లో అయితే సాగు పనులు ఇదే రోజు లాంఛనంగా మొదలుపెడతారు. సంవత్సరం దాకా ఎంత వర్షం పడుతుంది.. ఏ రోజుల్లో పడుతుంది.. ఏ పంటలు వేస్తే లాభం బంగారం, వెండి ధరలు ఎలా ఉండబోతున్నాయి.. ఉత్తరాన వరదలు దక్షిణాన కరువు పశ్చిమాన ఘర్షణలు తూర్పు రైతుకు నిట్టూర్పులు రాజకీయాల ప్రమాదాలు ధర ఖాతాలు వగైరా వగైరా అన్ని ఏడాది పొడుగునా తెలిపేదే పంచాంగం. మనకు ఆదాయం ఎంత ఖర్చు ఎంత రాజపూజ్యం ఎంత అవమానం ఎంత అనేది వివరంగా తెలియజేస్తుంది. పంచాంగం ఇందులో కావాల్సినంత వ్యక్తిత్వ వికాస కోణం ఇమిడి ఉంటుంది. మంచిచెడ్డలు అంచనాలు వేసే పంచాంగంలో మాత్రమే ఉండేదని పండితులు తెలుపుతున్నారు. రాజు మంత్రి సైన్యాధిపతి ధాన్యాధిపతి ఇలా పంచాంగ శ్రవణంలో ఎన్నో వివరాలను తెలియజేస్తారు. శిశిరంలో ఆకురాల్చే వసంతంలో చిగుర్లు వేయడం చెట్టు లక్షణం. నిన్నటి నీడల నుంచి బయటపడి ఎన్నటికీ ఆశావాహ దృక్పదాన్ని శ్వాసించాలన్నది రేపటి క్రోధినామ ఉగాది పండుగ మనకిచ్చే సందేశంగా చెప్పవచ్చు.

ఆర్మూర్: ఉగాది తెలుగువారింట ప్రత్యేక పండగ పల్లెల్లో ఉత్సాహంగా జరుపుకుంటారు .ఊరి దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. కొన్ని గ్రామాలలో ఎడ్లబండ్లను సైతం అలంకరించి పలు ప్రత్యేకమైన వంటకాలు చేస్తారు. ముఖ్యంగా ఉగాది పచ్చడి తొమ్మిది రుచులు వచ్చేలా చేస్తారు .ఎంతో ప్రత్యేకమైన ఈ పండగ రోజు తినే ఆహారంలో ఎన్నో పోషకాలు ఉంటాయి. వేపను ఉపయోగిస్తారు పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

.... నేడు క్రోధి నామ ఉగాది...

తెలుగు నూతన సంవత్సర ఆరంభానికి ప్రతీక ఉగాది.. చైత్ర శుద్ధ బహుళ పాడ్యమి రోజు వస్తుంది.. తెలుగు వారికి నూతన సంవత్సరం ప్రారంభం అని చెప్పుకోవచ్చు.. ఉగాది రోజు గ్రామాల్లో పంచాంగ శ్రవణం చెప్పడం ఒక ఆనవాయితీ.. సాయంత్రం పూట గ్రామ చావిడి లేదా సంఘ భవనాల యందు పురోహితులు రాశి ఫలాలు చెప్పడం, వాతావరణం.. వర్షాలు ఈ ఉగాది ఎలా ఉండబోతుంది, ఏ ఏ పంటలు పండుతాయి. ధరలు ఎలా ఉంటాయో మొదలైన విషయాలు వివరిస్తారు. గ్రామీణ సంస్కృతిలో భాగమైన గ్రామదేవతలకు పూజలు చేస్తారు.

ఉగాది పచ్చడి...

ఉగాది పండగలో ప్రత్యేకమైనది పచ్చడి.. ఈ పచ్చడి తయారీకి బెల్లం, వేపపూత, కొత్త మామిడి, చింతపండు ఉప్పు, ఓమ మొదలైన వాటితో తయారు చేస్తారు. ఈ షడ్రుచులు ఆరోగ్యానికి దోహద పడతాయి. వేప శరీరంలోని సర్వ రోగాలకు నివారణకు చింతపండు సి విటమిన్, బెల్లం లో కాల్షియం మామిడిలో లభించే పోషకాలు శరీరానికి చలువ చేస్తాయి. ఏబిసి కాల్షియం మొదలైన పోషకాలు బెల్లం రక్తహీనతను నివారిస్తుంది. ఈ విధంగా ఉగాది ఆరోగ్యకరమైన ప్రకృతి పండుగ.. మరొకటి. పోలెలు.. బెల్లం లేదా చక్కెర పెసరపప్పు, శెనిగపప్పు, కేసరి పప్పుతో తయారు చేస్తారు. కొత్తగా వ్యాపారస్తులు తమ ఖాతాలను ప్రారంభిస్తారు. మరికొన్ని చోట్ల మల్ల యుద్ధం కుస్తీ పోటీలు సైతం నిర్వహిస్తారు..

విశ్వబ్రాహ్మణుల పండగ...

విశ్వ బ్రాహ్మణులైన స్వర్ణకార ,వడ్రంగి, కమ్మరి, కంచరి, శిల్పి కులస్తుల ప్రత్యేక పండగగా ఉగాది అని చెప్పవచ్చు. ఈరోజు వారు ఉపయోగించే పనిముట్లను భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, మంచి రోజు చూసి కొత్త పనులు ప్రారంభిస్తారు..

నేడు పెర్కిట్ కుక్కల గుట్ట జాతర ..

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కుక్కల గుట్ట జాతర ఎంతో వైభవంగా నిర్వహిస్తారు.. పట్టణ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం ఈ జాతరలో పాల్గొంటారు.

మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టండి

- ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి



నవతెలంగాణ-కంఠేశ్వర్

మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలని ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి గోదా గోని రవి పిలుపునిచ్చారు. సోమవారం బిఎల్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో ఎం సిపిఐ య పార్టీ జిల్లా కమిటీ సమావేశం నర్సయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి ఎం సిపిఐ యు జిల్లా ఇంచార్జి వల్లెపు ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ.. పార్టీ జిల్లా శ్రేణులకు దశ దిశను నిర్దేశించారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో మ్యానిఫెస్టోలతో పోటీ జరుగుతున్నది, పది సంవత్సరాలు అనేక అబద్దాలతో పేద మధ్యతరగతి ప్రజల ఉసురు పోసుకుని కాలం వెళ్లదీసిన పార్టీ కాలగర్భంలో కలవడానికి కొద్దీ దూరంలోనే ఉందని తెలిపారు. మరోవైపు ఎలాగైనా అధికారం చేపట్టాలనే అక్కసుతో నోటికి ఏది వస్తే అది, మెదడులో ఏది తోస్తే అది ఇష్టాను సారంగా అమలుకు సాధ్యపడని హామీలతో ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చిన పార్టీని మనం చూస్తూనే ఉన్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. వంద రోజులల్లో అమలు చేస్తానన్న హామీలు ఎక్కడ? అని ప్రశ్నించారు. బోధన్ చక్కెర కర్మాగారం తెరిపించడానికి కాలయాపన దేనికోసమని అన్నారు. మరోపక్క కులం పేరుతో, మతం పేరుతో మనిషి-మనిషి కొట్టుకుచచ్చేలా మనుషుల మధ్య వైరుధ్యాలను పెంచుతూ మతోన్మాద భావజాలంతో మతరాజకీయాలు చేస్తున్న ఈ జిల్లా ఎంపీకి ఎన్నికలు వస్తే పసుపు బోర్డు గుర్తుకు రావడం పరిపాటిగా మారిపోయిందని తెలిపారు. కేవలం ఓటు బ్యాంకు కోసమే పసుపు రాజకీయం తప్ప మరొక్కటి లేదని, పార్టీల అధికారం మారుతుంది కానీ ప్రజల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక జిల్లా ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేసే ముందు జాగ్రత్త వహించి సరైన నాయకులను ఎన్నుకోవాలని వామపక్ష, బహుజన శక్తులు మార్క్స్ అంబేద్కర్ పూలే వారసులుగా బిఎల్ఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి కర్రోల్ల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు మేత్రి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు అంజయ్య, యండి మోసిన్, అనిల్, చిన్నోళ్ళ నర్సయ్య, సంగీత, సామెల్ రవి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని బోదేపల్లి గ్రామానికి చెందిన ఎం.నివేదిత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్లో చేరారు. వైద్య సహాయంకోసం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2లక్షల50వేల రూపాయలను ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసి మంజూరు చేయించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ బాలిక కుటుంబ సభ్యులకు ఎల్ఓసిని అందజేశారు.

10న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేషన్ పదవులు పొందిన జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ ప్రముఖులను సన్మానించేలా కార్యక్రమం చేపడుతున్నట్లు ముప్కాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేల్పూర్ మండలం లక్కోర ఏఎస్‌జీ గార్డెన్' లో ఈ నెల 10న బుధవారం సన్మాన కార్యక్రమంతో పాటు పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ (మైనింగ్) కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డికి రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పదవులు దక్కిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి

- కలెక్టర్, ఐసీడీఎస్ పీడీకి అంగన్‌వాడీల వినతి



నవతెలంగాణ-కంఠేశ్వర్

గత ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని తెలంగాణ అంగన్వాడీ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్, ఐసిడిఎస్ పిడికి వినతి పత్రం అందజేశారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మూడో తేదీన జారీ చేసిన మెమోను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అంగన్వాడిల సమ్మెను విరమింప చేయటానికి అప్పటి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 24 రోజులపాటు జరిగిన సమ్మె సందర్భంగా అక్టోబర్ 4న అప్పటి మంత్రులు హరీష్ రావు సత్యవతి రాథోడ్ చర్చలు జరిపారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు 60 సంవత్సరాలు దాటిన వారికి విఆర్ఎస్ సదుపాయాన్ని కల్పిస్తూ జీవో ఇవ్వటానికి అంగీకరించారని తెలిపారు. అమలు చేయకపోగా నేటి ప్రభుత్వానికి అనేకమార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ కొత్త ఉత్తర్వులను జారీ చేసి టీచర్లకు లక్ష రూపాయలు ఆయాలకు 50వేల రూపాయలు 65 సంవత్సరాలు నిండిన వారి వివరాలను అత్యవసరంగా ఆదేశించటం వల్ల అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు నష్టం జరుగుతుందని, వాటిని ఉపసంహరించుకొని గత ప్రభుత్వ హామీని అమలు జరపాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, యూనియన్ జిల్లా కార్యదర్శి పి స్వర్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకళ, జిల్లా నాయకులు వాణి, శివ రాజమ్మ, విజయ, గోదావరి , సిఐటియు నాయకులు వై గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి

- మండల ప్రత్యేక అధికారి యోహాన్


మాట్లాడుతున్న అధికారి యోహాన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎండాకాలంలో మండ లంలోని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని డిస్ట్రిక్ట్ లేబర్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి యోహాన్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి రవీందర్ ఆధ్వర్యంలో నాలుగు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల, తాగు నీరు, తీవ్రమైన ఎండలు, వడగాల్పులు, గ్రామాల్లో పారిశుధ్యం అనే అంశాలపైన సమీక్ష సమావేశం నిర్వహించి పలు విషయాలపై పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించి, పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఈఈ. ధర్మేందర్, యంపిఓ శ్రీనివాస్ గౌడ్, అన్ని గ్రామాల స్పెషల్ ఆఫీసర్స్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.


శ్రీక్రోధినామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలు

- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రజలందరు ఎలాంటి అభద్రతా భావంతో లేకుండా సుఖశాంతులతో ఉండాలని నిజామాబాద్ కమిషనరేటు పరిధిలోని ప్రజలందరకి పోలీస్ శాఖ తరపున నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ పండగ వాతావరణంలో చేసుకోవాలని సూచించారు. ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండే విధంగా పండగలను జరుపుకోవాలని పేర్కొన్నారు.

నిత్యావసరసరుకుల పంపిణీ



నవతెలగాణ - భీంగల్ రూరల్

ఈరోజు పురాణిపేట్ గ్రామ చర్చిలో ప్రేమ స్వరూపి మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డాక్టర్ పాల్ విశ్వనాథం సూచన మేరకు నిత్యావసర సరుకుల పంపిణీ బేతేస్థ చర్చ్ పురాణిపేట్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో దైవజనులు బెతేస్త సంఘ కాపరి పాస్టర్ ఫిలోమోన్, పాస్టర్ (డి) సామ్యూల్, బ్రదర్ హనోక్, భీమ్‌గల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొదిరే స్వామి, సాగర్, శివ క్రాంతి, దైడి.సురేష్ పాల్గొన్నారు. పాస్టర్ ఫిలోమోన్ మాట్లాడుతూ.. దేవుని మార్గంలో నడవాలంటే ఒకరికి ఒకరు సహాయం చేసుకుని ఇతరులను ప్రేమించే మనసును అలవర్చుకోవాలని ఆయన తెలిపారు.

వైకుంఠ రథం వితరణ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో సోమవారం గ్రామ అభివృద్ధి కమిటీ సహకారంతో గ్రామపంచాయతీకి రెండు లక్షల 30 వేల రూపాయల విలువ గల వైకుంఠ రథాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి వీడీసీ కమిటీలు, గ్రామ ప్రజలు పూర్తి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు శివలింగం, మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్, పంచాయతీ కార్యదర్శి బాబు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వైకుంఠరథం అందజేత

ఎంబీఏ విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

నవతెలంగాణ-కామారెడ్డి

ఎంబీఏ చదువుతున్న మౌనికకు లాప్‌టాప్‌ను సోమవారం అందజేసినట్టు రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి అధ్యక్షులు పోలబోయిన సత్యం తెలిపారు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయి దాతల సహకారంతో ఎంబీఏ వరకు చదువుకుందని, ప్రస్తుతం తన చదువుకు లాప్‌టాప్ ఆవశ్యకత ఉన్నందున ఆ అమ్మాయికి లాప్‌టాప్ అందించనున్నట్టు తెలిపారు. దాత పసలపూడి చిన్నారావు దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పి.రాజనర్సింహారెడ్డి, కోశాధికారి తోరణాల సుధాకర్, సీనియర్ సభ్యులు బి.నాగభూషణం, వై.శంకర్, కైలాస చంద్రశేఖర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాలు కల్పించాలి

- **అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు సత్వరమే పూర్తి చేయాలి**
- **కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

నవతెలంగాణ-పిట్లం/కామారెడ్డి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారము మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత , ప్రాథమిక , ఉర్దూ మీడియం పాఠశాల లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఎంపికైన పాఠశాలలో అవసరమైన రిపేర్లు, త్రాగునీరు, టాయిలెట్ , వంటి మౌలిక సదుపాయాలను సకాలంలో పూర్తిచేయాలని సలహాలు, సూచనలు పాఠశాలల కమిటీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంఈఓ దేవి సింగ్ , ప్రధానోపాధ్యా యులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కామారెడ్డి : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ఏర్పాటు చేయబోతున్న వివిధ పనుల అంచనా వ్యయాలను పరిశీలించడానికి సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మండలంలోని చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీరు వసతి, విద్యుత్ సౌకర్యము వివిధ మరమ్మత్తులు మొదలగు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్, ఐఐటి గాంధీనగర్‌లో జరిగిన క్రియేటివ్ లెర్నింగ్‌కి సంబంధించిన సదస్సులలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచిన ఈ పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు విజయగిరి రామకృష్ణకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, ఎంఈఓ ఎల్లయ్య ఉపాధ్యాయుడు ఆకుల బాబు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉదయాన్నే ఉపాధి పనులు నిర్వహించాలి

- **ఎంపీడీవో సవితా రెడ్డి**

నవతెలంగాణ-రామారెడ్డి

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలు ఉదయాన్నే పనికి వెళ్లి, ఎండ తీవ్రత అయ్యేలోపే ఇండ్లల్లోకి రావాలని స్థానిక ఎంపీడీవో సవితారెడ్డి సోమవారం కూలీలకు సూచించారు. మండలంలోని మద్దికుంటలో ఉపాధి హామీ నూతన సంవత్సర పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీవో ధర్మారెడ్డి మాట్లాడుతూ... కొలతల ప్రకారం పనులు నిర్వహించి, పనికి తగిన వేతనాన్ని పొందాలని, పని ప్రదేశంలో నీటిని అందుబాటులో ఉంచుకోవాలని, పనికి హాజరు కాని వారిని, ఫోటోలో లేని వారికి కూలి డబ్బులు రావని, తప్పకుండా మొదటి ఫోటో, రెండో ఫోటో మధ్య కాలవ్యవధి నాలుగు గంటల సమయం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు చిన్న స్వామి, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నేడు ఆలయ భూముల కౌలు వేలం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో గల శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ భూములు కౌలుకు వేలం పాట నేడు(మంగళవారం) ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణంలో నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ చాట్ల గోపాల్ తెలిపారు. ఆలయ భూముల కౌలు కోసం గ్రామ వ్యవసాయదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో కొనసాగుతుంది. శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ భూముల కౌలు వేలంపాట కోసం గ్రామంలో దండోరా వేయించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ మరియు ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్ తెలిపారు. కస్తూర్బా గాంధీ వసతి గృహంలో 174 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 14 మందికి దృష్టిలోపం ఉన్నందున కంటి అద్దాలు ఇవ్వడానికి సిఫారసు చేసినట్లు ఆయన తెలిపారు. ఇద్దరు విద్యార్థినిలకు దృష్టిలోపం ఉన్నందున సరోజిని కంటి దవాఖానకు సిఫారసు చేస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. అదేవిధంగా ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా ఐదుగురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు హరి కిషన్, మనోజ్, నిక్కత్, హెచ్ ఈ వో రామారావు తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎమ్మెల్యేను కలసిన మైనార్టీ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావును సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో లింగంపేట్ పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి సంబంధించి పలు సూచనలను కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో నయీమ్ ఇబ్రహీం, తిరుమల, కిరణ్, అబ్దుల్ ఖుదూస్, ఎండీ నోమన్, సోహెల్ ఉన్నారు.

వైస్ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్ గ్రామంలో వైస్ ఎంపీపీ ఉమాకాంత్ దేశాయ్‌గారి పెద్ద నాన్న హన్మంత్‌రావ్ కులకర్ణి మరణించిన విషయాన్ని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను సోమవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పరామర్శించారు. ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్న తానున్నని భరోసా కల్పించారు. ఎమ్మెలే వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేమ్రాజ్ కల్లాలీ, మాజీ సర్పంచ్ రమేష్ రావ్ కులకర్ణి, తదితరులు ఉన్నారు.

ప్రచార కమిటీ అధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-పిట్లం

కాంగ్రెస్ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన బొడ్ల రాజుకు మండల ఆర్యవైశ్య యూత్ ఆధ్వర్యంలో పూలమాల, శాలువాలతో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య యూత్ అధ్యక్షుడు గుర్జల రామ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తూ, రానున్న పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపుకు కృషి చేయాలని, ఆర్యవైషలను ఏకతాటిపై నడిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు సాయిప్రసాద్, కపిల్, విక్రమ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



బొడ్ల రాజును సన్మానిస్తున్న పలువురు

పార్టీ మారగానే
అవిశ్వాసాలు ఆనవాయితీగా మారాయి

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

అవినీతి రహిత కామారెడ్డిని చేయడమే తన లక్ష్యమని అని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాప్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ మారగానే అవిశ్వాస తీర్మానాలు ఆనవాయితీగా మారాయని ఎద్దేవ చేశారు. ఈ నెల 15న జరగబోయే మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో నీతి నిజాయితీ గల వ్యక్తిని చైర్మన్‌గా కామారెడ్డి కౌన్సిలర్లు ఎన్నుకోవాలని అలా ఎన్నుకుంటే తమ బీజేపీ కౌన్సిలర్లతో పాటు తాను కూడా వారికి సహకరిస్తానన్నారు. చైర్మన్ పోటీలో బిజెపి పార్టీ ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యేగా ఒకరు ముఖ్యమంత్రి, ఒకరు కాబోయే ముఖ్యమంత్రి ఓడించడం అంత సులువు కాదని నేను ఓటర్లను ఏ విధంగా మభ్య పెట్టలేదని తెలపారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రజలకు ఏమి కావాలో తెలుసుకొని వారి అన్ని సమస్యలతో ఉంటానని మాట ఇవ్వడంతో వారు తనను నమ్మి తన నుంచి రూపాయి ఆశించకుండా తనకు 70,000 మంది ఓట్లు వేశారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత కామారెడ్డి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి ఇక అవినీతి పాలన అంతమైందని నీతివంతమైన పాలన వస్తుందని ఓ ప్రముఖ రాజకీయ నాయకుడు అనడం అస్యాస్పదంగా ఉందని అన్నారు. ఒక్క చైర్మన్ సీటు జాహ్నవి అవినీతి చేసిందని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీ డెబ్బై కోట్ల అప్పుల్లో ఉందని ప్రతి సంవత్సరం నీతివంతంగా మున్సిపల్ చైర్మన్ పాలన చేస్తే 40 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ఇప్పటికే కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొందరు ప్రముఖులు 9,10 లక్షల వరకు మున్సిపల్‌కు ఆదాయపన్ను చెల్లించకుండా ఉన్నారన్నారు. ఓ సూపర్ మార్కెట్ యాజమాని నాలుగున్నర లక్షల వరకు మున్సిపల్‌కు బాకీ ఉన్నాడని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్లో ఉన్న 49 మంది కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం లేకుండానే సర్వేనెంబర్ ఆరులో కబ్జాలు, మాస్టర్ ప్లాన్, శ్రీవారి వెంచర్ ఏర్పాటు తదితర వాటిలో ఎన్నో అక్రమాలు జరిగాయని ఇన్ని జరిగిన కౌన్సిలర్లకు మాత్రమే ఏమీ తెలియదన్నారు. కౌన్సిలర్లు కేవలం సమావేశాలకు రావడం నవ్వుకోవడం వెళ్లిపోవడం వరకే ఉందన్నారు. ఇప్పటికైనా కౌన్సిలర్లు గుండెల మీద చేయి వేసుకొని తమకు ఓటు వేసిన ప్రజల కోసం ఆలోచించాలన్నారు. కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎవరైనా భూకబ్జాలను ఆపడమే తన లక్ష్యమని, కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు సమస్య ఉందని తన వద్దకు రావడం కాదని, సమస్య ఉన్నవద్దకే కామారెడ్డి ఎమ్మెల్యే వెళ్తాడని ఈ మాటను తాను తప్పక నిలబెట్టుకుంటానని విలేకరుల సమావేశంలో అన్నారు.

తండాలో ఎలుగుబంటి సంచారం

- **భయాందోళనకు గురైన గిరిజనులు**
- **అటవీ ప్రాంతంలో నీటి వసతి లేక జనారణ్యంలో వస్తున్న జంతువులు**

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని బోనాల గ్రామపంచాయతీ పరిధిలోని చింతల గుట్ట తండాలో సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఎలుగుబంటి సంచరించడంతో తండావాసులు భయాందోళనకు గురైయ్యారు. ఎండలు తీవ్రం కావడంతో అటవీ ప్రాంతంలో వన్యప్రాణలకు తాగునీరు లేకపోవడంతో తాగునీటికి అటవీ ప్రాంతం నుండి చెరువులు కుంటలకు వద్దకు బోరుభవుల వద్దకు వస్తున్నట్టు స్థానికులు తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం సాయంత్రం చింతలగుట్ట సమీపంలోని అటవీ ప్రాంతం నుండి ఎలుగుబంటి తాండ సమీపంలోని చెరువు వద్దకు తాగునీటి కోసం వచ్చిందన్నారు. అది గమనించిన తండావాసులు భయభ్రాంతులకు గురై తాండాలోకి పరుగులు తీశారు. ఎలుగుబంటి వచ్చిందని తాండావాసులకు చెప్పడంతో తాండవాసులు చేతులు కర్రలు పట్టుకొని అరుపులు కేకలతో వేయడంతో అటవీ ప్రాంతానికి వెళ్ళింది తాండవాసులు ఊపిరి పీల్చుకున్నారు. గత వారం రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తుందని తాగునీటి కోసం చెరువు వద్దకు వస్తుందని తాండావాసులు తెలిపారు. రాత్రివేళ వ్యవసాయ బోరు బావుల వద్దకు పశువుల కాపరులు మేకల కాపర్లు ప్రాంతానికి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు అటవీ శాఖ అధికారులు వన్యప్రాణులకు తాగునీటిని ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



అటవీ ప్రాంతంలోకి తిరిగి వెళ్తున్న ఎలుగుబంటి

పదేండ్లల్లో.. చేసిందేమీ లేదు

- **బీబీపాటిల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధం : కాంగ్రెస్**

నవతెలంగాణ-లింగంపేట్

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో పదేండ్లుగా ఎంపీగా కొనసాగిన బీబీపాటిల్ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవని, దీనిపై చర్చకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు పర్యాయాలుగా పార్లమెంట్ సభ్యునిగా ఉండి ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఏమీ అభివృద్ధి పనులు చేశాడో చెప్పాలని అభివృద్ధి చేసినట్లయితే చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. నియోజకవర్గంలో మారుమూల గిరిజన ప్రాంతాలు మారుమూల గ్రామాలు ఉన్నప్పటికీని ఏ గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవన్నారు. నామమాత్రంగా మండల కేంద్రానికి వచ్చి ప్రత్యక్షమయ్యాడు తప్ప సంక్షేమ పథకాలు అభివృద్ధి విషయంలో నియోజకవర్గానికి చేసినట్లయితే నిరూపించుకోవాలని లింగంపేట్ అంబేద్కర్ చౌరస్తాలో చర్చకు సిద్ధమని కాంగ్రెస్ నాయకులు విసిరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుప్పాల రాజు, లింగంపేట్ పట్టణ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్ మండల కాంగ్రెస్ నాయకులు పతియోద్దీన్, బైరయ్య, ఇబ్రహీం, రవికుమార్ గుప్తా, రాము గౌడ్, భాస్కర్ గౌడ్, నగేష్, కుద్దూస్, ఆమన్ కిరణ్ తో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బుర్రగౌడ్

ఆలయంలో ఉగాది పూజలు

నవతెలంగాణ- రామారెడ్డి

మండల కేంద్రంలోని శ్రీ కాళికాదేవి ఆలయంలో సోమవారం ఉగాది అమావాస్యను పురస్కరించుకొని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, శ్రీనివాస్, ముకుందం, సూర్య మోహన్, సుధాకర్, భరత్, యాదగిరి, కందుకూరి శ్రీనివాస్, పవన్ తదితరులు ఉన్నారు.

ఎవరి దయతోనో గెలవలే

- **మాజీ విప్‌పై ఎంపీపీ గాల్ రెడ్డి**

నవతెలంగాణ-భిక్కనూర్

గంప గోవర్ధన్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని ఎంపీపీ గాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బర్రెల కొట్టం నుంచి తీసుకొచ్చి గెలిపించిన అని మాట్లాడుతూ రైతులను కించపరిచే మాటలు మాట్లాడడం సరికాదని, నీ గత మిరపకాయల చరిత్ర అందరికీ తెలుసని తెలిపారు. తన మీద రెబల్ వేసిన క్యాండిడేట్‌ను విత్ డ్రా చేయించడం చేతకాలేదని, తనకున్న పేరుతో గెలిచానే కానీ ఎవరి దయతో తాను గెలవలేదన్నారు. ఎంపీపీ ఇవ్వడానికి ఎంత ఖర్చు పెట్టించావో అందరికీ తెలుసన్నారు. కెసిఆర్‌ను ఓడగొట్టిన, కామారెడ్డి నియోజకవర్గంలో అసలు దొంగ ఎవరో అందరికి తెలుసని అసెంబ్లీ ఎన్నికల్లోనే నీ నిజ స్వరూపం బయటపడిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్, జంగంపల్లి సొసైటీ చైర్మన్ సిద్ధ రాములు, నాయకులు లింగారెడ్డి, మాజీ సర్పంచ్ స్వామి పాల్గొన్నారు.

రాజీనామా చేసి మళ్లీ గెలిచి చూపు..

- **గంప గోవర్ధన్‌ను విమర్శించే స్థాయికాదు : బీఆర్ఎస్**

నవతెలంగాణ-భిక్కనూర్

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ను విమర్శించే స్థాయి తనది కాదని ఎంపీపీ గాల్‌రెడ్డిని ఉద్దేశించి బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంపిపి గాల్ రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే గంప గోవర్ధన్ అని అసలు వార్డు మెంబరుగా కూడా గెలవని నిన్ను ఎంపీపీని చేస్తే కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయిన నువ్వు గంప గోవర్ధన్‌ను విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి ఎంపీటీసీగా గెలిచిన నువ్వు ఎంపీటీసీ, ఎంపీపీ పదవికి రాజీనామా చేసి మరోసారి ఎన్నికల్లో గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కండువాలు మార్చే వ్యక్తులు మరోసారి గంప గోవర్ధన్ ను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మల్లేశం, రామేశ్వర్ పల్లి సొసైటీ చైర్మన్ భూమ్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు సాయిరెడ్డి, ఎంపీటీసీ సాయ గౌడ్, నాయకులు మహేందర్ రెడ్డి, నర్సారెడ్డి, ప్రభాకర్, బసవయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

పండుగలను శాంతి యు తంగా నిర్వహించు కోవాలని తహసీల్దార్ సంజయ్ రావు, ఏసై గణేష్ సూచించారు. దోమకొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయం లో ఉగాది పండగ పై పీస్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్ల బండ్ల ప్రదర్శనను ప్రతి ఏటాలాగే ఈసారి కూడా సీరియల్ నెంబర్ ప్రకారం ఎడ్ల బండ్ల ర్యాలీ నిర్వహించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్,ఆర్ ఐ మహేందర్, పోలీస్ లు, గ్రామస్థులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని రాఘవపల్లి గ్రామంలో గల ఎంపీ యుపిఎస్ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఎల్లారెడ్డి వాస్తవ్యులు ముస్త్యాల ప్రవీణ్ వారి తల్లిదండ్రులు ముస్త్యల రామవ్వ, జగదీశ్వర్ జ్ఞాపకార్థం విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీలత, మూర్తి, మేఘమాల తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి కామారెడ్డి పట్టణానికి చెందిన కాశీనాథం పంతులు 5,116 రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు సిద్ధరాములకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు పంతులు, కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు లింగారెడ్డి, ఆలయ పూజారి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఉల్లంఘనపై సి - విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు

జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

సి -విజిల్ యాప్ ద్వారా ప్రతి ఒక్క పౌరుడు తమ దృష్టికి వచ్చిన ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ఫిర్యాదు చేయవచ్చని వారి పేర్లు, ఫోన్ నెంబర్లు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరులు తమ చుట్టుపక్కల జరుగుచున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించిన ఫోటోలు లేదా వీడియోలను ఈ యాప్‌లో నిర్భయంగా అప్ లోడ్ చేయవచ్చని, ఫిర్యాదు అందిన వంద నిముషాలలో స్పందించనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సి - విజిల్ కు ఇప్పటి వరకు వచ్చిన 15 ఫిర్యాదులకు తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా 1950 టోల్ ఫ్రీ నెంబరుకు ఓటరు కార్డు, ఓటు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్నది తదితర వివరాలకోసం 295 కాల్స్ రాగా అన్నింటికీ సమాధానాలు ఇచ్చామని అన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదేని సమాచారం, ఫిర్యాదుల కొరకు 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ లోని 1950 కి, సి - విజిల్ కు సమాచారమందించవలసినదిగా కలెక్టర్ కామారెడ్డి జిల్లా ప్రజలను కోరారు. ఎన్నికల వేళ నగదు, మద్యం, తాయిలాల ప్రవాహాన్ని అరికట్టుటకు సరిహద్దు చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచామని కలెక్టర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ కందూరి బాలమణి లింబాద్రి ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. మండలంలోని ఇస్సన్నపల్లి గ్రామానికి చెందిన దొంతుల నరేష్ గత నాలుగు రోజుల క్రితం మరణించగా, బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకొని, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కల్వకుంట్ల మదన్ మోహన్ రావు గారి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ 3000, 25 కేజీల బియ్యం అందజేశారు. మదన్ మోహన్ రావు గారితో చరవాణిలో మాట్లాడిపించి, అన్ని రకాలుగా ఆదుకుంటామని, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బంటు రాజేందర్, దోమకొండ బైరయ్య యాదవ్, కొర్రి శంకర్, రెడ్డిపేట బాలయ్య, తుమ్మల రమేష్, ఎడ్ల రాజయ్య పాల్గొన్నారు.

నేడు కుస్తీ పోటీలు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని నేరల్ గ్రామంలో నేడు(సోమవారం) కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఉగాది రోజు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొని కుస్తీ పోటీలను విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.

ప్రజాసంక్షేమం.. కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. మండలంలోని తడి హిప్పర్గ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌కి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు 100 మంది వరకు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డి.సాయిలు, మాజీ ఎఎంసి చైర్మన్ సంగమేశ్వర్ హనుమాన్, స్వామి వట్నాల వార్ రమేష్ బాలు షిండే, తడి ఇప్పర్గా తాజా మాజీ సర్పంచ్ ప్రకాష్ గైక్వాడ్ పాల్గొన్నారు.

రూసేగావ్‌లో ముగిసిన సప్త.. హాజరైన ఎమ్మెల్యే

మండలంలోని రూసేగావ్ గ్రామంలో సప్త కార్యక్రమం సోమవారం ముగిసింది. అన్నదాన కార్యక్రమాన్ని అన్న దాతగా గ్రామానికి చెందిన ఆనంద్ రావు పటేల్ ఆధ్వర్యంలో చేపట్టారు. సప్త ముగింపు రోజున జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొద్దిసేపు భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. సప్త విజయవంతం కావడానికి గ్రామ తాజా మాజీ సర్పంచ్ గోవింద్ ఆధ్వర్యంలో సకల సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో బాలాజీ, రావుపటేల్, సంఘయ్యప్ప, తాజా మాజీ సర్పంచ్ గోవింద్, తాజా మాజీ ఉపసర్పంచ్ రాము, యోగేష్ పటేల్, రామారావు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
4
మంగళవారం | ఏప్రిల్ 09, 2024 | www.navatelangana.com

కూలీలకు ప్రథమ చికిత్సకిట్లు అందజేత

నవతెలంగాణ-భీంగల్



మండలంలోని 27 గ్రామపంచాయ తీల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ప్రథమ చికిత్స కిట్లను ఏపీవో నర్సయ్య సోమవారం అందజేశారు. ఉపాధి కూలీలను వడదెబ్బ నుండి కాపాడేందుకు ఈ ప్రథమ చికిత్సకిట్లు అందజేస్తున్నట్లు ఏపీవో తెలిపారు. ఒక్కో గ్రూపుకు ఒకటి చెప్పునా 27 కిట్లను అందజేసినట్లు ఏపీవో తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-బాల్కొండ



మండల పరిధిలోని వన్నెల్ బి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యదర్శి మోహమ్మద్ మోహిద్ పాషా మాట్లాడుతూ 2024 సంవత్సర వరి ధాన్యం ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్ ఏ క్వింటాలుకు 2203 రూపాయలు, గ్రేట్ బి క్వింటాలుకు 2183 రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది, గ్రామ పెద్ద మనుషులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి

- జిల్లా ప్రత్యేక అధికారి శరత్
- నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి శరత్ సూచించారు. సోమవారం ఆయన సెల్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో నీటి సరఫరా పర్యవేక్షణ తీరుపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి ఇతర సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఒక్కో నివాస ప్రాంతం వారీగా నీటి సరఫరా తీరును అనునిత్యం పరిశీలించాలని అన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారి శరత్ ఆదేశించారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగు నీటి ఎద్దడి నెలకొనకుండా అప్రమత్తతతో కూడిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడ కూడా అలసత్వానికి తావులేకుండా అంకితభావంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇంట్రా విలేజ్, పైప్ లైన్, వాటర్ పంపింగ్ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. ఎక్కడైనా పైప్ లైన్ లీకేజీలు ఏర్పడిన వెంటనే వాటిని సరి చేయాలని, చేతి పంపులు, బోరు బావుల మరమ్మతులను వెంటదివెంట జరిపించాలన్నారు. అవసరమైన చోట వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నీటి ఎద్దడి నివారణ చర్యలలో చివరి ప్రయత్నంగా మాత్రమే అద్దె ట్యాంకర్లను వినియోగించాలని సూచించారు. పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నీటి ఎద్దడి నెలకొనకుండా సమర్ధవంతంగా పని చేయాలని అధికారులకు హితవు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన జిల్లా అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరా తీరును పరిశీలించడం జరిగిందని, అన్ని మండలాల్లో ఎంపిడిఓలు, ఎంపిఓలతో కూడిన క్లస్టర్ బృందాలను సైతం ఏర్పాటు చేశామని ప్రత్యేక అధికారి దృష్టికి తెచ్చారు. 239 మంది పంప్ మెకానికులు, 77 మంది సహాయ మెకానికులు మరమ్మతులకు అందుబాటులో ఉన్నారని, వారి వివరాలను అన్ని మండలాల అధికారులకు అందించడం జరిగిందన్నారు. నీటి సరఫరా మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన పెండింగ్ లో ఉండిన 178 పనులలో వారం వ్యవధిలోనే 36 పనులను పూర్తి చేయడం జరిగిందని, మరో పది రోజులలో మిగితా అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వివిధ కారణాల వల్ల నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన నివాస ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందిస్తున్నామని అన్నారు. స్థానికంగా వనరులు అందుబాటులో లేని నాలుగు నివాస ప్రాంతాలకు నీటి సరఫరాకై వ్యవసాయ బోరుబావులను అద్దెకు తీసుకోవడం జరిగిందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా సజావుగానే జరుగుతోందని, ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టేవిధంగా అధికారులను, క్షేత్ర స్థాయిలో సిబ్బందిని సన్నద్ధం చేశామని అన్నారు. సెల్ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తపాల ప్రమాద బీమా పాలసీ తీసుకోవాలి

సబ్ పోస్ట్ మాస్టర్ జగదీష్

నవతెలంగాణ - మాక్లూర్

ప్రతి ఒక్కరు తపాలా భీమా పాలసీ తప్పని సరిగా చేసుకోవాలని సబ్ పోస్ట్ మాస్టర్ జగదీష్ తెలిపారు. మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తపాలా ఆధ్వర్యంలో టాటా సంస్థ ద్వారా రూ. 520 చెల్లిస్తే ప్రమాద బీమా రూ. 10 లక్షలు వర్తిస్తుందని, నివ సంస్థ ద్వారా రూ. 555 చెల్లిస్తే రూ. 10 లక్షలు, రూ. 755 చెల్లిస్తే రూ. 15 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని, ఇది సంవత్సర బీమా ప్రీమియం అని తెలిపారు. ప్రమాదంలో అగవైకల్యం ఏర్పడిన పూర్తి ప్రీమియం వర్తిస్తుందని, పిల్లలకు విద్య ప్రయోజనం, ఆసుపత్రిలో ఖర్చుల నిమిత్తం చెల్లిస్తుంది తెలిపారు. ఈ ప్రీమియం చెల్లించిన 15 రోజుల నుంచి వర్తిస్తుందని వివరించారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-ఆర్మూర్



సీపీకి బొకేను అందజేస్తున్న తులసికుమార్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పట్టణానికి చెందిన సామాజిక సేవకులు తులసి కుమార్ అన్నారు. జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కను, జ్ఞాపికను, తను రూపొందించిన స్వాతంత్ర అంశాల సేకరణ పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలను పెంచి పర్యావరణ పరిరక్షణలో కాలుష్య నియంత్రణకు వేడిమి తీవ్రతకు తగ్గించే విధంగా మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. ఈ సందర్భంగా పట్వారీ తులసి సేవలు అభినందనీయమని అన్నారు.

భూమి కబ్జాపై నిరసన

- గ్రామ పంచాయతీ వద్ద వంటవార్పు



వంటావార్పు చేస్తున్న కాలనీవాసులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని భవాని నగర్ వాసులు సోమవారం గ్రామ పంచాయతీ వద్ద వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. వెంచర్ లేఅవుట్ నిబంధన ప్రకారం 10శాతం భూమిని తమ కాలనీ అవసరాల కోసం కేటాయించగా కొందరు అక్రమంగా ఆ భూమిని కబ్జా చేస్తున్నారని కాలనీవాసులు గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్నారు. ఇటీవల కొందరు ఆ స్థలంలో హద్దురాళ్ల ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు నిరసనను ఉద్రిక్తం చేశారు. శనివారం కాలనీవాసులందరూ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందించారు. ధర్నాను కొనసాగిస్తూ సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వంటావార్పు ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు.

మర్నాంగి పట్టివేత

అటవీ శాఖ అధికారులకు అప్పగింత

నవతెలంగాణ-నవీపేట్



పట్టుకున్న మర్నాంగి

మండలంలోని ఫస్ట్ ప్లాట్ మదర్సా శివారులోని పంట పొలాలలో వింత జంతువు మర్నాంగిని పట్టుకొని అటవీశాఖ అధికారులకు సోమవారం అప్పగించారు. స్థానికుల సమా చారం మేరకు అటవీశాఖ అధికారి సురేష్ పంట పొలాలలోని పాడుబడ్డ ఇంట్లో మర్నాంగి ఉందని తెలపడంతో స్థానికుల సహ కారంతో పట్టుకొని నిజామాబాద్ రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లి అనంతరం అటవీ ప్రాంతంలో వదిలి పెట్టినట్లు అటవీశాఖ అధికా రులు తెలిపారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్ ఏఎన్ఎంలతొ వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఎన్ఎం ఆశావర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకుని రైతులకు కూలీలకు, ఉపాధి కూలీలకు వడదెబ్బ గురించి అవగాహన కల్పిస్తూ వారికి అందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎఫ్‌డీఎస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

డీఈవో పైన చర్యలు తీసుకొవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (ఏఐఎఫ్‌డీఎస్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ ఆరోపణలకు కేంద్ర బిందువుగా మారిందని, తద్వారా విద్యాశాఖ పరువు బజారు పాలవుతుంది అని అన్నారు. విద్యా శాఖలో సస్పెన్షన్ ఎదుర్కొన్న ఎఫ్ఏఓని డిఇఓ కాపాడుతున్నారని పత్రికల్లో వచ్చిన వార్తలపైన సరైన చర్యలు లేకపోవడం బాధాకరమని అన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఎఫ్ఏఓగా కొనసాగుతున్న వనిత మీద గతంలో అనేక ఆరోపణలు ఉన్నాయని, అయినా తన బాధ్యతలను మరో సంవత్సరం పాటు పొడిగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దొంగ చాటున అర్ధరాత్రులు సంబంధిత శాఖకు మెయిల్ ద్వారా అర్జీ పెట్టడం అనేక అనుమానాలకు తావిస్తుందని అన్నారు. అలాగే జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న సిబ్బందికి ఒక రకమైన రూల్, డిఇఓకు ఇంకో రకమైన రూలు ఉంటుందా అని ప్రశ్నించారు, ఎందుకని అంటే ఈ మధ్యకాలంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శిక్షణ తరగతులు పెట్టడం జరిగింది, ఈ శిక్షణ తరగతులకు 84 మంది సిబ్బంది గైర్హాజరు కావడం వల్ల వారికి యుద్ధప్రాతిపాదికన షోకాజు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. కాని డిఇఓ మీద ప్రతి రోజు అవినీతి ఆరోపణలతో పాటు అనేక రకాల ఆరోపణలు వస్తున్నప్పటికీ, ఎలాంటి నోటీసులు జారీ కాకపోవడం ఎంతవరకు సమంజసమో ఉన్నత అధికారులు ఒక్కసారి ఆలోచన చేయాలని అన్నారు. జిల్లా కేజీబీవిల్లో మార్చి 25 నుంచి 31 లోపు జరిగిన లావాదేవీల్లో అనేక అవకతవకలు జరిగి లక్షల రూపాయలు చేతులు మారినట్లుగా జిల్లా మొత్తం ఆరోపణలు వెలువడుతున్నాయని తెలిపారు. ఇంత జరుగుతున్న జిల్లా విద్యాశాఖ ప్రక్షాళన చేయడం కోసం, డిఇఓ మీద ఎలాంటి చర్యలు లేకపోవడం జిల్లాకు పట్టిన దురదృష్టంగా భావిస్తున్నానని ఆరోపించారు. విద్యాశాఖను గాడిన పెట్టేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని, తక్షణమే చర్యలు తీసుకోవాలని, కేజీబీవిలో జరిగిన లావాదేవీల పైన విచారణ చేపట్టాలని, లేనిపక్షంలో రానున్న రోజులలో జిల్లా శాఖ ప్రక్షాళన చేసే విధంగా భారీ ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్డీఎస్ జిల్లా నాయకులు జె.విలాస్, టి. గోపాల్, సంతోష్, గణేష్, యశ్వంత్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు రూ.3 లక్షలు అందజేత



నగదు అందజేసిన జడ్జీ పద్మావతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ నిజామాబాద్ ఆధ్వర్యంలో సీనియర్ లీగల్ జడ్జి పద్మావతి చేతుల మీదుగా ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబం అనాథ పిల్లలకి 3 లక్షల రూపాయలు సోమవారం అందజేసినట్లు సంస్థాన్ సిర్నపల్లి తాజ మాజీ సర్పంచ్ తేలు విజయ్ కుమార్ తెలిపారు. గతంలో భార్య భర్తను చంపి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న నిందితురాలు పిల్లలు అనాథలు గా మారారు. ఆ పిల్లలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ నిజామాబాద్ వారి నిధుల నుండి ఈ పిల్లల బావిష్యత్తుకోసం ఉపయోగ పడే విధంగా 3 లక్షలు అందించినట్లు వివరించారు. పిల్లలకు రాబోవు రోజుల్లో ఇబ్బందులు కలగకుండా లీగల్ సర్వీసెస్ అథారిటీ నిజామాబాద్ 3లక్షలు ఇవ్వడం చాలా గర్వకారణమని లీగల్ సర్వీసెస్ అథారిటీ నిజామాబాద్‌కు కుటుంబం తరపున సిర్నాపల్లి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు, సూపరింటెండెంట్ పురుషోత్తం, రిటైర్డ్ ఎఎస్ఐ జీవన్ రావ్, సిర్నాపల్లి మాజీ సర్పంచ్ తెలు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- నర్సరీని సందర్శించిన ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



నీటి ఇబ్బందులగురించి తెలుసుకుంటున్న ఎంపీడీవో

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో తాగునీటి ఇబ్బందులపై పలు నివాస గృహాలను సందర్శించి నీటి ఇబ్బందులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వేసవి దృష్ట్యా గ్రామంలో ఎక్కడ కూడా ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా పైపులను మరమ్మతులు అవసరం ఉంటే తక్షణమే మన మత్తులు చేయించాలని సూచించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను పరిశీలించిన ఆయన ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఉంటే తక్షణమే గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారికి సూచించారు. అనంతమైన గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించి పరిశీలించారు. ఎండల అధికమైనందున మొక్కల సంరక్షణకు తగిన జాగ్రత్తలు చేపట్టాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. మొక్కలను రక్షించేందుకు షెడ్ నెట్ లను ఏర్పాటు చేయడంతో పాటు నీటి తడులు అందించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నరసయ్య, తదితరులు ఉన్నారు.

వర్సిటీలో గ్రూప్-1 కోచింగ్ తరగతులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో కాంపిటేటివ్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీ పరీక్షల అవగాహన తరగతులు కొనసాగుతున్నాయి. రిసోర్స్ పర్సన్ గా డాక్టర్ రాధాకృష్ణ చౌహన్, సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ప్రజాస్వామ్యం -భారత రాజ్యాంగం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగానికి ఒక ప్రత్యేకత ఉందని ప్రపంచ దేశాల సుపరిపాలన విధానాలను, రాజ్యాంగం ద్వారా దేశంలో ఆచరిస్తున్నారని పేర్కొన్నారు. హక్కులతో పాటు, విధులను భారత రాజ్యాంగంలో చర్చించారని పేర్కొన్నారు. కులాలకు మతాలకు అతీతంగా భారత రాజ్యాంగం తన విశిష్టతను కాపాడుకొంటుందని పేర్కొన్నారు. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఈ గ్రూప్ 1 కోచింగ్ క్లాసులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని పేద మధ్యతరగతి విద్యార్థులకు లాభం జరుగుతుందని తెలిపారు. తన వంతుగా పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను లైబ్రరీకి అందించారు. సోమవారం విద్యార్థులకు ప్రేరణ కలిగించిన డాక్టర్ రాధాకృష్ణ చౌహాన్‌కు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరి, కాంపిటేటివ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కెవి.రమణ చారి, కామర్స్ డీన్ ప్రొఫెసర్ రాంబాబు, జీ.శ్రీనివాస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంటాక్ట్) తదితరులు అభినందనలు తెలిపారు.

పాఠశాలలో బాలకవి సమ్మేళనం

- ఉగాది పచ్చడి వితరణ



కవిసమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఉగాది పండుగను పురస్కరించుకుని ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో తడపాకల్ ఉన్నత పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు బాలకవి సమ్మేళనంలో పాల్గొని, ఉగాది గొప్పతనం గురించి కవితల రూపంలో వినిపించారు. తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ... సమ్మేళనాన్ని ఏర్పాటు చేయడంవల్ల విద్యార్థులకు సాహిత్యంపై మక్కువ కలుగుతుందని అన్నారు. కవితలు వినిపించిన విద్యార్థులకు కథల పుస్తకాలను బహుమతిగా అందించి, ఉగాది పచ్చడి వితరణ చేశారు. ఉపాధ్యాయులు సుధాకర్, రాములు, గంగాధర్, నాగప్ప, రవి, కృష్ణ ప్రసాద్, నరేందర్, సుజాత, స్వప్న పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు: కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికి శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. తెలుగు నామాది నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని మనసారా కోరుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉగాది పండగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అభిలషించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలు, ఆనందోత్సాహాలతో జీవనాలు వెళ్లదీయాలని ఆకాంక్షించారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టుకు

ప్రథమ బహుమతి రావడం అభినందనీయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



సాఫ్ట్‌బాల్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రథమ బహుమతిని తీసుకుని రావడం అభినందనీయమని ఇందల్‌వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, శిక్షణ కోచ్ ఆకుల సుష్మ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగిన దేశంలోని 28 రాష్ట్రాలకు చెందిన సాఫ్ట్‌బాల్ నేషనల్ పోటీలో తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టుకు ఇందల్‌వాయి ఏకలవ్య పాఠశాలకు చెందిన కే.సోని కెప్టెన్‌గా వ్యవహరస్తూ జట్టు ప్రథమ స్థానంలో రావడానికి, జట్టు గెలుపులో ప్రధాన భూమిక పోషించారని వారు వివరించారు. రాబోవు రోజుల్లో కే.సోని మరింత రాటు దేలుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జాతీయ జట్టుకు నాయకత్వం వహించే విధంగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ జి శ్రీనివాస్, శిక్షణ కోచ్ అకుల సుష్మ సంధ్య కోరారు. అనంతరం కె.సోనికి వారందరూ అభినందించారు

కాంగ్రెస్ పథకాల వల్లే చేరుతున్నాం



కాంగ్రెస్‌పార్టీలో చేరిన పలువురు నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో ఇందల్‌వాయి మండలంలోని గౌరారం, లింగాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ధర్పల్లి మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. చేరిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా చేరడం అభినందనీయ మన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని వారందరికీ సూచించారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కావాలన్న తమవంతుగా పాటు పడతానని తెలిపారు. రాబోవు రోజుల్లో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి ముదిరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను అమలు చేస్తుందని, మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీ బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీకి 10లక్షలు, 200వందల వరకు కరెంట్ ఫ్రీ, త్వరలో రేషన్ కార్డులు తదితర వాటిని అమలు చేస్తుందని వివరించారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, తామందరం ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు గౌరరం తాజా మాజీ ఉప సర్పంచ్ గోద స్వామి, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు గుండ్ల నర్సయ్య, నరేష్, పల్లికొండ నర్సయ్య విజయ్, రాజుతో పాటు 30మంది చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గోదావరిలో దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- తండ్రి బర్త్ డే రోజే తనయుడి ఆత్మహత్య
- చదువుపై విరక్తితో
- నాగేపూర్ లో విషాద ఛాయలు

నవతెలంగాణ-నవీపేట్



చదువుపై విరక్తి చెంది ఇంటర్ విద్యార్థి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యంచ గోదావరిలో సోమవారం చోటుచేసుకుంది. ఇంచార్జ్ ఎస్ హెచ్ఓ గఫర్ వివరాల ప్రకారంజజ నాగేపూర్ గ్రామానికి చెందిన పులి సూర్య (18) నిజామాబాద్ లోని విక్టరీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ కోచింగ్‌కు శిక్షణ పొందుతున్నాడు. ఆయన తండ్రి శ్రీనివాస్ పుట్టినరోజు ఒకరోజు ముందు ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం కేక్ కట్ చేసి తనకు చదువు ఏమి అర్థం కావడం లేదని బోరున విలపించాడు. తర్వాత బయటకు వెళ్తానని చెప్పి బైక్ తీసుకొని వెళ్ళాడు. తండ్రికి అనుమానం రావడంతో వెంటనే ఇతరుల బైక్ పై గోదావరి వద్దకు వెళ్లగా అక్కడ బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు ఇప్పుడే గోదావరిలో దూకాడని తెలిపారు. అక్కడున్న మత్స్యకారుల పడవపై గాలించగా కొన ఊపిరితో ఉన్నాని భావించి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందాడని వైద్యుడు తెలిపారు. తండ్రి శ్రీనివాస్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబీకులతో పాటు గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

ఉపాది పనుల పరిశీలన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పడంపల్లి, బిజ్జల్ వాడీ గ్రామంలో ఉపాదిహమీ కూలీ పనులు ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. కొలతల ప్రకారం పని చేస్తే మొత్తం కూలీ డబ్బులు చెల్లించనున్నట్టు తెలిపారు. ఎండలు మండి పోతున్నాయి కావున తగిన జాగ్రత్తలు పాటించాలని, ఉదయం ఆరు గంటలకు పనులను ప్రారంభించి ముగించాలని, అందరికి ఓఆర్ఎస్ ప్యాకేట్లు పంపిణి చేయడం జర్గిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడీవో శ్రీనివాస్, పడంపల్లి ఏఫ్ఏ సూర్యకాంత్, బిజ్జల్ వాడి ఏఫ్ఏ పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పూడికతీత పనుల పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని పల్లె చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా కొనసాగుతున్న పూడికతీత పనులను ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ సోమవారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కూలీల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసిన చేశారు. కూలీలతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన కొలతల మేరకు పూడిక తీయాలన్నారు. కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పని కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు, తాగేందుకు నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు రక్షణ కోసం ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం

- రెండు నెలలు నిద్ర లేని రాత్రులు గడిపా
- ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేస్తే చీపురుతో కొట్టండి
- ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రెండు నెలలు నిద్ర లేని రాత్రులు గడిపానని నిజామాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేయడానికి వచ్చే ఎమ్మెల్యేను మహిళలు చీపురుతో కొట్టాలని చెక్కుతో పాటు ఒక తులం బంగారం ఎక్కడని నిలదీయాలని సూచించారు. సోమవారం ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామం లోని గంగపుత్ర సంఘంలో మండల బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమెల్సీ వీ గంగాధర్ గౌడ్‌తో కలిసి బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా ఆర్టీసీ బస్సులో ఆడవారికి ఉచితం తప్ప మిగిలిన ఏ హామీలు కూడా ఎందుకు అమలు కావటం లేదని ప్రశ్నించారు. ఎంపిగా ఐదేళ్లు చేసిన అరవింద్ ఏ గ్రామానికి వెళ్లి ఎన్ని నిధులు ఇచ్చారని ప్రశ్నించారు. ఒక్కరోజైనా గ్రామంలోని సమస్యలను పట్టించుకోని బీజేపీ అభ్యర్థి అరవింద్ మళ్లీ పోటీ చేస్తుండని, గ్రామాల్లో ఏమి పని చేయని అరవింద్‌కు ఓటు అడగటానికి ఎలా వస్తారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఒక్కసారి కూడా మండలానికి వచ్చింది లేదన్నారు. కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానని, అనునిత్యం వందలాది మంది తనవద్దకు వచ్చిన వారి పనులను చేసి పెట్టానని, పైరవి కారులే పోతుంటారని, నాయకులు పోరని బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. సిఎం కేసీఆర్ ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, ఆయన ఆదేశానుసారమే నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని అన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ ఓటు శాతం ఎక్కువగా ఉందని, ప్రతిఒక్కరూ ఓటు వేసి నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బాజిరెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఎంపిగా గెలిస్తే రానున్న రోజుల్లో కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తనలో ప్రశ్నించే తత్వముందని, బాజిరెడ్డిని గెలిపించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఓటమికి బయపడరని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి బాజిరెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గడ్డం సుమనారవిరెడ్డి, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, దర్పల్లి జడ్పీ టీసి బాజిరెడ్డి జగన్ మోహన్, వైస్ ఎంపీపీ భూసని అంజయ్య, మండల అధ్యక్షులు చిలువేరి దాస్, మండల మహిళ విభాగం అధ్యక్షురాలు పులి వసంత సాగర్, మండల రైతు కోఆర్డినేటర్ మోహన్ నాయక్, ఎస్సీసెల్ రూరల్ కన్వీనర్ పాశంకుమార్, సీనియర్ నాయకులు గడ్కోల్ శ్రీనివాస్, తేలు విజయకుమార్,ఎంపిటిసిలు చింతల దాస్, కచ్చకాయల అశ్విని శ్రీనివాస్, మారంపల్లి సుధాకర్, బాబు రావు, డీకోండ సరిత సుదిర్, తటిపాముల శ్రీనివాస్ గుప్తా, గంగాధర్, పులి శ్రీనివాస్, రఘునథన్ రాము, బిరీష్ శెట్టి, అరటి రఘు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

కాంగ్రెస్ పార్టీకి మాలల మద్దతు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ పార్టీకి మాలలు మద్దతు తెలుపుతున్నామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య అన్నారు. నిజామాబాద్ జిల్లా మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య అధ్యక్షతన రాబోయే పార్లమెంటు ఎలక్షన్ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చాలనే ప్రయత్నం చేస్తుందని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. భారత దేశ రాజ్యాంగం 85 శాతం ఉన్న పేద వర్గానికి న్యాయం చేసే విధంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నంది వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల కిష్టయ్య, నగర కార్యదర్శి బట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లూరులో సీసీ కెమెరాలు ఏర్పాటు


సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న ఎస్ఐ భాస్కరా చారి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూర్ గ్రామంలో గ్రామస్తులంతా ఒక్కటై 26 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు ఎస్ఐ భాస్కరా చారి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొంతకాలంగా గ్రామస్తులకు సీసీ కెమెరాల నిఘా గురించి పలు కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామస్తుల్లో కదలిక వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో గ్రామస్తులు ఏకమై గ్రామంలో 26 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నిఘానేత్రంలో నల్లూరు గ్రామం ఉందన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరుపున నల్లూర్ గ్రామస్తులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ భాస్కరా చారి స్థానిక గ్రామ పెద్దలతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. యువత గంజాయికి అలవాటు కాకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని యువకులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ భాస్కరా చారి, ఏఎస్సై గంగారం, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసీఆర్ విమర్శలు దుర్మార్గం

నవతెలంగాణ-బోధన్

మాజీ ముఖ్యమంత్రి టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై మాజీ సీఎం కేసీఆర్ విమర్శలు చేయడం దుర్మార్గమని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమిపాలై తన పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు వలసబాట పట్టడంతో మతిభ్రమించిన కేసీఆర్ కరీంనగర్ పర్యటనలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నిరాధార విమర్శలు చేయడం సమంజసం కాదని తెలిపారు. కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. ఎన్నికలో ఓటమి పాలై తీవ్ర నిరాశతో ఉన్న కేసీఆర్, చంద్రబాబు నాయుడును విమర్శించడం ద్వారా తిరిగి ప్రాంతీయవాదని, అధికారం కోసం కుట్రలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కూతురు కవిత లిక్కర్ స్కాములో జైలు పాలు కావటం, కుమారుడు కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్‌లో ఇరుక్కుని పోవడం సహించలేని కేసీఆర్ ప్రజల దృష్టిని మళ్లించడం కోసం అసంబద్ధ చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. పార్లమెంటరి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని లబ్ధిపొందాలనే దూరలోచనతో ప్రజలలో ప్రాంతీయవాదన్నీ, అసమానతలను రేకెత్తించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పార్లమెంటరీ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించి ఆయనకు గుణపాఠం చెప్పాలని ప్రజలకు హన్మంతరావు విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీడీవో వెంకటేష్ జాదవ్

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కమిటీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 30 పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. సాలూర మండలంలో 10 పాఠశాలలో ఈ కమిటీలు ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు పాఠశాల ప్రధానోపాధ్యాయుల సహకారంతో పాఠశాలలోని సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు తాగునీటి, మరుగుదొడ్ల, విద్యుత్ సౌకర్యాలు లాంటివి పాఠశాలలు పున్ణప్రారంభం అయ్యేవరకు పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలలో ఎలాంటి సమస్య లేకుండా చూడవలసిన బాధ్యత ఉంటుందన్నారు. అనంతరం ఎంఈఓ నాగనాథ్ మాట్లాడుతూ.. వేసవి సెలవులలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని సూచించారు. లక్ష రూపాయలలోపు చేపట్టవలసిన పనులను ఎంపీడీవో సహకారంతో చేయాలని, లక్ష రూపాయలపైన చేపట్టవలసిన పనులను కలెక్టర్ సహకారంతో పాఠశాలలో పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పీఆర్ఏఈ సాయిలు, బోధన్ మండల నోడల్ అధికారి నాగయ్య, సాలూరా మండల నోడల్ అధికారి రాజమంజుష, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌లు, సిఆర్పిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేష్ జాదవ్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో

పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా పనులు పూర్తిచేయాలి
- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు వర్క్‌షాప్

నవతెలంగాణ-బాల్కొండ/కమ్మర్‌పల్లి/ జక్రాన్‌పల్లి/ భీంగల్

జూన్ 10 నాటికి మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన పాఠశాలల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాల సంపూర్ణ నమూనా రూపొందించాలని ప్రభుత్వ పాఠశాల పరిస్థితులను మెరుగు పరచడానికి పిల్లలకు మెరుగైన విద్య అందించడానికి అమ్మ ఆదర్శ కమిటీలు సకాలంలో పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని బాల్కొండ మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యాచరణ సమావేశంలో ఉమ్మడి బాల్కొండ మండలం పరిధిలోని బాల్కొండ, మెండోర, ముప్కాల్ మండలాల అభివృద్ధి అధికారులైన విజయ్ భాస్కర్ రెడ్డి, వనజ, ముజఫర్ వివిధ శాఖల ఏఈలు షరీఫ్, వినీత్, నాగేశ్వరరావు, మూడు మండలాల మహిళా సమాఖ్య చైర్ పర్సన్స్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాల అభివృద్ధి పనులపై మహిళా సంఘాలు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ మౌలిక సదుపాయాల వసతి రూపకల్పనలో భాగంగా బాల్కొండ మండలంలో 15, మెండోరా మండలంలో 15, ముప్కాల్ మండలంలో 11పాఠశాలలు ఆదర్శ పాఠశాల పథకంలో ఎంపిక అయ్యాయని అన్నారు. ఈ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం, విద్యుదీకరణ, మూత్రశాలల మరమ్మత్తులు, తాగునీరు ఏర్పాటు, బాలికలకు ప్రత్యేక మూత్రశాలల ఏర్పాటు, తదితర పనులను నాణ్యతతో ఏ విధంగా చేపట్టాలో అనే విషయంలో ఇంజనీర్స్, మండల అభివృద్ధి అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు సూచనలు చేశారు. మౌలిక వసతుల బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు స్థానిక మహిళా సంఘం సభ్యులు కలిసి అమ్మ ఆదర్శ కమిటీలుగా రూపొందించామని అన్నారు. ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎంపిక చేసి ఆదర్శ మహిళ కమిటీలో చోటు కల్పించడం జరుగుతుందని, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలికి, ప్రధానోపాధ్యాయులకు జాయింట్ చెక్ పవర్‌తో అమ్మ ఆదర్శ కమిటీలు ప్రత్యేక బ్యాంకు ఖాతాను వెంటనే ప్రారంభించాలని విద్యాశాఖ అధికారి సూచించారు. పాఠశాలలు పున్ణ ప్రారంభానికి ముందే తప్పనిసరిగా బాలికల మూత్రశాలలు, బాలుర మూత్రశాలలు, తాగు నీటి సరఫరా, తరగతి గదిలో ఉన్న మరమ్మత్తులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. పాఠశాలను అమ్మ ఆదర్శ కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులను గుర్తించాలని అన్నారు. వాటికి ప్రతిపాదనలు రూపొందించి జూన్ 10 నాటికి మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యే విధంగా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని, పాఠశాలల నమూనాను సంబంధిత ఇంజనీర్లతో ముందస్తుగా ఒక కాగితంపై రూపొందించుకోవాలని తెలిపారు. పాఠశాలలో ఓపెన్ గ్రౌండ్, ఆట స్థలాలు డిస్టబ్ చేయకుండా నూతన భవనాల నిర్మాణం ప్రణాళిక ఉండాలని మండల అభివృద్ధి అధికారులు సూచించారు. మహిళా సంఘాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పాఠశాల అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలని అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలవద్ద 25వేల రూపాయల నిధులు అందుబాటులో ఉంటాయని, వీటిని ఎటువంటి అనుమతి లేకుండా పాఠశాల కోసం ఖర్చు చేయవచ్చని, 25 వేల నుంచి లక్ష రూపాయలు ఖర్చు పనులను స్థానిక ఎంపిడిఓ, లక్షకు పైగా ఖర్చుతో పనులను జిల్లా స్థాయిలో పర్యవేక్షిస్తారని, పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి నిధులకు ఎటువంటి కొరత లేదని, పనులు జరిగిన వెంటనే సంబంధిత బిల్లులను జిల్లా స్థాయిలో క్లియర్ చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. విద్యార్థులకు యూనిఫామ్ సైతం మహిళా సంఘాలలో టైలరింగ్ ప్రావీణ్యం ఉన్న వారిచే కుట్టించడం జరుగుతుందని అన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ అధ్యక్షతన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ వర్క్ షాప్ నిర్వహించారు. మండలంలోని 18 ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై వర్క్‌షాప్‌లో చర్చించారు. పాఠశాలల్లో అవసరమైన త్రాగునీరు సౌకర్యం, మైనర్ రిపేర్స్, విద్యుత్ సౌకర్యం తదితర వాటి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన పద్యంలో వర్క్ షాప్ నిర్వహించి పాఠశాలలో అవసరమైన పనులను గుర్తించినట్లు ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు. వేసవి సెలవులు ముగిసి, నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమయ్యే లోగా పనులన్నింటినీ పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివోలు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లి: మండలకేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ... పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా, వీవో అధ్యక్షులు చైర్మన్‌గా వ్యవహరిస్తూ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఏబీఎన్ రవీందర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.


భీంగల్: అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేయాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ ఎంఈఓ స్వామి తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన ప్రధానోపాధ్యాయులు, ఐకెపి వివో, విఏఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన వాటిలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, క్లాస్ రూమ్లలో ఫ్యాన్లు, విద్యుత్ కనెక్షన్లు, వసతులను పంచాయతీరాజ్ అధికారుల సమన్వయంతో జూన్ 15 లోపు పూర్తిచేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ మేఘన, ఏపీఎం రవీందర్, ప్రధానోపాధ్యాయులు, ఐకెపి వివో, వీఏవోలు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి: మాట్లాడుతున్న అధికారి


భీంగల్‌లో..


బాల్కొండలో..



జక్రాన్‌పల్లిలో..

ఏఐపీఎస్‌యూ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

ఏఐపీఎస్‌యూ విద్యార్థి సంఘం బోధన్ డివిజన్ నూతన కమిటీని సోమవారం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శివాజీ, కార్యదర్శులుగా సాయికుమార్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పవన్, సాయి, తరుణ్, శివమాలను ఎన్నుకున్నారు. అనంతరం భవిష్యత్తు కారాచరణపై చర్చించారు. విద్యారంగ సమస్యను రాబోవు రోజులలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు భవిష్యత్తు ఉద్యమ కార్యచరణని ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.7800 కోట్లు సంక్షేమ రంగానికి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వేసవి సెలవులలో శిథిలవస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి భవనాలను కళాశాల భవనాలను పునర్నిర్మించాలని, వచ్చే విద్యా సంవత్సరానికి ఎటువంటి సమస్యలు లేకుండా సజావుగా విద్యసాగే విధంగా అన్ని సౌకర్యాలు ఈ వేసవి సెలవులలో పూర్తి చేయాలని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసే విధంగా భవిష్యత్తు పోరాటాలు ఉంటాయని అన్నారు. సమావేశంలో జిల్లా ఇంచార్జి బోడ అనీల్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నవతెలంగాణ- మోపాల్

మోపాల్ గ్రామానికి చెందిన క్యాతం సాయిలు కూతురు కిడ్ని సంబంధిత వ్యాధితో భాదపడుతు ఒడటంతో కెంపు అశోక్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదకొండు వేల రూపాయల ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చెప్పు అశోక్, మోపాల్ ఎంపిటిసి ముత్యం, చిన్నయ్య లక్ష్మీనర్సయ్య సాయిలు, నర్సయ్య, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.